రేపు తిరుమలకు రానున్న ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకష్ణన్ ఈ నెల 24, 25 తేదీల్లో తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న సందర్భంగా ఏర్పాట్లు ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జెసి శుభం బన్సల్ తో కలిసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ముందస్తు భద్రత ఏర్పాట్లు లో భాగంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి సమావేశం నిర్వహించారు. ఉపరాష్ట్రపతి సిపి రాధాకష్ణన్ తిరుమల శ్రీవారినీ దర్శించుకోనున్న సందర్భంగా ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని తెలిపారు. సమావేశం అనంతరం రేణిగుంట విమానాశ్రయం నందు మందస్తు భద్రత లైజన్, భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.

అక్రమ కట్టడాలకు హద్దేలేదు..

పట్టణ ప్రణాళిక అధికారికి పట్టనేలేదు.. • రోడ్లను ఆక్రమించి ప్రహరీ నిర్మాణాలు

ఆకాశమంత ఎత్తులో....

ప్రజాశక్తి - నాయుడుపేట

నగరాల్లో, మున్సిపాలిటీల్లో అక్రమ కట్టడాలకు హద్దే లేకుండా ఉంది.. ఎక్కడ చూసినా ఆకాశమంత ఎత్తులో అనుమతి లేకుండా భవనాలను నిర్మిస్తున్నా పట్టణ ప్రణాళిక అధికారి నిర్లక్ష్యం మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది.. సూళ్లూరుపేటకు రెగ్యులర్, నాయుడుపేటకు ఇన్‌ఛార్జిగా ఉన్న పట్టణ ప్రణాళిక అధికారి కనుసన్నల్లోనే అక్రమ భవంతులు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నా, ఆయన లెక్కచేయరంటే వెనకున్న రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారన్న విమర్శలూ లేకపోలేదు. నాయుడుపేటకు ఇన్‌ఛార్జిగా ఉండడంతో అపుడపుడు 'మెరుపు'లా వచ్చి పోతుంటారని చర్చ జరుగుతోంది.

మున్సిపాలిటీ పరిధిలో ఏవైనా నిర్మాణాలు చేపడితే పట్టణ ప్రణాళిక అధికారి అనుమతి తప్పనిసరి. నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలను కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. సంబంధిత అధికారి ఆ స్థలానికి వెళ్లి పరిశీలించి నిబంధనల ప్రకారం ఉందా, లేదా పరిశీలించి అనుమతి ఇవ్వాలి. ఇది జరగాల్సిన తంతు. అయితే ఇందుకు భిన్నంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాల్లో ఉన్న వాటిని పరిశీలిస్తే సగం పైనే అనుమతులు లేవని తెలుస్తోంది. కొంతమందైతే ఏకంగా రోడ్లను సైతం ఆక్రమించేసి ప్రహరీగోడల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

పట్టణ ప్రణాళిక అధికారి 'నో యాక్షన్'

ఈ విషయమై పట్టణ ప్రణాళిక అధికారి బాలసుబ్రమణ్యంను 'ప్రజాశక్తి' వివరణ కోరగా 'అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించామని, అయినా వారు వినకుండా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశామని, కోర్టుకు పంపిస్తున్నామని, కోర్టు నుంచి అనుమతులు రాగానే ఎంతటి వారైనా శిక్షిస్తాం' అని చెబుతున్నారు. అయితే 'నో యాక్షన్'. 'ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నారు' అని ప్రశ్నించగా 'ప్రతిదానికి నన్ను అడుగుతారు ఏంటి.. మున్సిపాలిటీకి ప్రధాన అధికారి కమిషనర్‌తో మాట్లాడుకోండి' అని నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎస్‌కె ఫజీవుల్లా దృష్టికి తీసుకెళ్లగా నిర్మాణాలన్నీ పట్టణ ప్రణాళిక అధికారి పరిధిలో ఉంటాయని, ఎటువంటి చర్యలైనా ఆయన స్వయంగా తీసుకోవచ్చని సమాధానం ఇచ్చారు. ఖచ్చితంగా మా సహకారం ఉంటుందన్నారు. 'పట్టణ ప్రణాళిక అధికారి కార్యాలయానికి వస్తే కదా ఏదైనా అడగడానికి ' అని కమిషనర్ మాట్లాడటం గమనార్హం. కార్యాలయానికి వారంలో కనీసం రెండు రోజులైనా రాకపోతే ఎటువంటి యాక్షన్‌కు వెళ్లారన్నది కమిషనర్ చెప్పాల్సి ఉంది. ఏమైతేనేం ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అక్రమ కట్టడాలను మాత్రం నిర్లక్ష్యానికి వదిలేశారు. మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతున్నా గమ్మునే ఉన్నారంటే 'రాజకీయం' ఏంటో మరి.

విద్యుత్ పోల్‌కు కలిపేసి ప్రహరీ

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

రేపు చంద్రబాబు తిరుపతికి రాక

బ్రహ్మోత్సవాల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బుధవారం 24వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజే శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను చంద్రబాబు దంపతులు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో 24, 25 తేదీల్లో తిరుపతి పర్యటనకు రానున్నారు. పర్యటన ఏర్పాట్లు, బందోబస్తు విషయంలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జెసి శుభం బన్సల్ తో కలిసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ముందస్తు భద్రత ఏర్పాట్లు లో భాగంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్న నేపథ్యంలో ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రదేశాల్లో విధులు కేటాయించిన అధికారులు అందరూ సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లు ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. సేఫ్టీ రూమ్ అధునాతన లైఫ్ సపోర్ట్ ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, శానిటేషన్ ఏర్పాట్లు, కాన్వాయ్ వెహికల్స్ ఏర్పాటు, హెలిపాడ్ నందు భద్రత ఏర్పాట్లు, ప్రోటోకాల్ అంశాలు తదితర విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

తాజ్ హోటల్ సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్.పి సుబ్బరాయుడు తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

గురవరాజుపల్లిలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - రేణిగుంట

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వస్థ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం రేణిగుంట మండలంలోని తారకరామానగర్ పిహెచ్సీ పరిధిలో గల గురవరాజుపల్లి సచివాలయంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ జుబేర్ అహ్మద్ తెలిపారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలక్ష్మి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, సర్పంచ్ షెహనాజ్ బి, స్థానిక నాయకుడు మునికష్ణ, ఎంపిహెచ్ఈఓ నాగరాజు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో సిటీస్కాన్ అవసరం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి ఈఎస్ ఐ ఆసుపత్రిలో సోమవారం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం. శ్యాంబాబు అధ్యకతన హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో కార్మికుల కోసం సిటీ స్కాన్ తదితర మరిన్ని పరికరాలు, వైద్య విభాగాలు ఏర్పాటు చేయాలనీ కోరుతూ ఈ. ఎస్. ఐ. కార్పొరేషన్, ప్రభుత్వం దష్టికి తీసుకొని వెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ఆర్ ఎంఓ డాక్టర్. ఏవిఎస్ ప్రసాద్, స్థానిక ఈఎస్ ఐసి బ్రాంచ్ మేనేజర్ సి. నాగమణి, కమిటీ సభ్యులు జి.శ్రీనివాస రావు, బ్లిస్. రవిశంకర్ రెడ్డి, సిటీ కేబుల్ రామచంద్ర రెడ్డి, పి. రామ్ మోహన్, ఎన్. మోహన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా జే.ఎఫ్రాయిమ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా మెప్మాప్రాజెక్ట్ డైరెక్టర్ గా జే . ఎఫ్రాయిమ్‌ను నియమించారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం, ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లి అర్హత గల ప్రతి సంఘ సభ్యురానికి నూతన జీవనోపాది చూపేలా తన వంతు కృషి చేస్తానని ఎఫ్రాయిమ్ చెప్పారు. నైట్‌షెల్టర్, ఒఎన్‌డిసి ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో సేల్స్ చేయించడం చేస్తానన్నారు.

పిఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ధనశేఖర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రోగ్రెస్సివ్ సఫాయి కర్మచారీ సంఘం(పిఎస్ ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన డాక్టర్ జి.దనశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రోగ్రెసివ్ సపాయి కర్మచార సంఘం జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 10 సంవత్సరాల పాటు ఈయన సేవలు అందించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా నిస్వార్థ సేవలను అందించారు. కార్మికులకు అందుతున్న సౌకర్యలపై యాజమాన్యంతో పోరాడి, వాళ్ల సమస్య పరిష్కారానికి కషి చేశారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనని ఎన్నుకున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ ఈఈగా గంగాధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీఎస్పీడిసిఎల్ ఆపరేషన్ విద్యుత్ ఈఈగా సి.గంగాధర్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగరంలోని టౌన్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు అద్భుతమైన సేవలు అందించేందుకు కషి చేస్తానన్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన ఆయనను విద్యుత్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

'అమర'లో గౌరినేని బర్త్‌డే వేడుక

ప్రజాశక్తి- రేణిగుంట

అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి 61వ పుట్టినరోజు వేడుకలను ఆస్పత్రి ఆవరణలో సోమవారం సాయంత్రం వైద్యులు, సహచరుల మధ్య నిర్వహించారు. ఛైర్మన్ గౌరినేని ప్రసాద్ దగ్గరుండి కేక్ కటింగ్ చేయించారు. రామచంద్ర నాయుడు , గల్లా అరుణ కుమారి తమ ఆశీస్సులను అందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో భాగ్యలక్ష్మి, పిఆర్ఓ మునినాదం, వైద్యులు వరుణ్, శాలిని, రవికుమార్, అనుపమ తదితరులు రమాదేవికి సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలు బోలెడు...!

పరిష్కారం చూపించరు..!

'మండే' మొత్తం 382 అర్జీలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎప్పటిలానే 221 రెవెన్యూ సమస్యలు అత్యధికంగా వచ్చాయి. మొత్తం 382 అర్జీలు రాగా, డిఆర్ఒ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజ్‌మోండ్, సుధారాణిలతో కలిసి జాయింట్‌కలెక్టర్ శుభం బన్సల్ అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీదారునికి నాణ్యమైన పరిష్కారం చూపాలని ప్రతిసారీ ఉన్నతాధికారులు చెబుతూనే ఉన్నా, పరిష్కారం చూపుతున్నారా? లేదా? అన్నది ప్రశ్నార్థకమే. ఈ సోమవారం వచ్చిన సమస్యల్లో స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధించి పది అర్జీలు వచ్చాయి.

గ్రామ పంచాయతీ భూమిని కాపాడాలి : ఎం.లలిత, సర్పంచి, పాపానాయుడుపేట

1993లో గ్రామ అభివృద్ధి కోసం రాస్ వారికి సర్వే నంబర్ 182/1లో 28 సెంట్లు భూమిని అప్పటి సర్పంచి వెంకటాచలపతి పంచాయతీ కార్యవర్గంలో తీర్మానించి అప్పచెప్పారు. ఇప్పుడు గతంలో సర్పంచ్ గా పనిచేసిన యానాదిశెట్టి కుమారుడు ప్రకాష్ సదరు స్థలం తమదంటూ, ప్రచారాలు చేస్తూ ఆ భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. రాస్ వారికి ఇచ్చిన సదరు భూమికి సంబంధించి గ్రామపంచాయతీ ఆస్తిగా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలి.

మిట్టగాంధీపురం గానే : బాబు, న్యూమంగళం

ఉవ్వ మ్మ డి శెట్టిపల్లె పంచాయతీలోని మిట్ట గాంధీపురం గ్రామాన్ని పంచాయతీ విభజన అనంతరం మిట్టగాంధీపురం హరిజనవాడగా మార్చేశారు. దశాబ్దాల కాలంగా మిట్టగాంధీపురం గానే ఉన్న పరిస్థితుల్లో, ఇలా పేరు మార్చడం తగదని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని మిట్టగాంధీపురం గ్రామంగానే పిలిచేలా మార్పులు కోసం చర్యలు తీసుకోవాలి.

అంగీకరించిన ఒప్పందాలు అమలు చేయాలి

విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి అంగీకరించిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం గతంలో విద్యుత్ సంస్థలకు ఇచ్చిన నోటీసును జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కు అందించారు. ఇంజనీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించాలని, విద్యుత్తు ఉద్యోగులకు పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్యుల ఖర్చులు చెల్లింపు, విద్యుత్ విభాగ ఉద్యోగులతో నిర్వహింపబడుతున్న 33/11 కెవి సబ్ స్టేషన్ లను కాంట్రాక్టులకు ఇవ్వడం ఆపాలని, 2019లో నియమింపబడ్డ ఎనర్జీ అసిస్టెంట్లు లను రెగ్యులర్ జేఎల్ఎంలుగా పరిగణించి వేతనాలు ప్రయోజనాలు కల్పించాలని, యూనియన్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం గత మూడు దశాబ్దాల నుండి అమలు జరుపుతున్న పద్ధతి లో పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వేసిన ఏడాదికే కంకర తేలిన రోడ్డు : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని 33, 44 వార్డులకు సంబంధించి స్థానిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా నాయకులు పి.సాయిలక్ష్మి, ఎం.నరేంద్ర మాట్లాడుతూ 34వ వార్డులో డెడ్‌ఎండ్ వీధిలో రోడ్డు వేసిన ఏడాదిలోపే రోడ్డు గుంతలు ఏర్పడి కంకర తేలిందన్నారు. రోడ్డును బాగు చేయాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలాజీ దోబీఘాట్‌లో ఉతికిన బట్టలు ఆరేసుకునే ప్రదేశాన్ని శుభ్రపరచాలన్నారు. ఆదర్శ దోబీఘాట్ సమస్య పరిష్కరించాలన్నారు. కమిషనర్ స్పందిస్తూ రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, రజకులు బట్టలు వేసుకునే స్థలాన్ని శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, మల్లికార్జునరావు, లోకేష్, సురేష్, బాలాజీ, రవి, కోదండ, నాగేంద్ర పాల్గొన్నారు.

తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 37 వినతులు వచ్చాయి. 31 మంది నేరుగా, ఆరు ఫోన్ ద్వారా సమస్యలను వివరించారు. కెబి లేఔట్‌లో రోడ్లపై మద్యం తాగి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రకాశం పార్కు వాకింగ్ ట్రాక్ బురదమయం అయ్యిందని, సుందరయ్యనగర్‌లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, ఏసిపిలు మూర్తి, మధు పాల్గొన్నారు.

పర్యావరణానికి తూట్లు

95శాతం రసాయన విగ్రహాలే
ప్రచారాల్లోనే 'మట్టి విగ్రహాలు'
ప్రతిసారీ 'చవితి'కి ఇదేతంతు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పెరుగుతున్న రసాయనాల వినియోగం, అధికమవుతున్న ప్లాస్టిక్ వాడకం, సాంకేతికతను పెంచుకునేందుకు వాడుతున్న పదార్థాలు ఇలా అన్ని కలిపి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నాయి. కరువు కాటకాలు ఓ వైపు, కుంభవృష్టి మరోవైపు.. ఇవన్నీ చాలవన్నట్లు 'క్లౌడ్ బరెస్ట్'లు.. ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోతున్నాయి.. పర్యావరణ పరిరక్షకులు గగ్గోలు పెడుతున్నా, అధికారులకు మాత్రం ఇవేమీ పట్టడం లేదు.. ప్రచారం తప్ప, ఆచరణ శూన్యం. తాజాగా వినాయక చవితి సంబంధించి మట్టి విగ్రహాలే వాడాలని పెద్దఎత్తున ప్రచారం చేశారు. తీరా నిమజ్జనం తరువాత 'వినాయకసాగర్' చెరువు పరిశీలిస్తే అన్నీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (రసాయనాలతో కూడిన) విగ్రహాలే. 95 శాతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలనే వాడారంటే అతిశయోక్తి కాదు. వారం రోజుల క్రితం సెప్టెంబర్ 16న ఓజోన్ డేను పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొరకు తూట్లు పొడుస్తూ, పర్యావరణ పరిరక్షణ పేరుతో సభలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు..

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పాతిక రోజుల క్రితం జరిగిన ప్రజల స్వయం కపారాధనను ఒకసారి పరిశీలిద్దాం. తిరుపతి నగరంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించారు. వీదివీధిన, వాడవాడల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. అధికారికంగా 900 భారీ విగ్రహాలు, అనాధికారికంగా (అనుమతులు లేనివి) మరో 500 విగ్రహాలు, వీటితో పాటు ఇళ్లల్లో నెలకొల్పిన జానెడు ఎత్తు నుంచి 2 అడుగుల వరకు వేలాది విగ్రహాలు ఉండనే ఉన్నాయి. వీటన్నిటిని పూజల అనంతరం మొదటి రోజు, మూడో రోజు, ఐదో రోజు, ఏడో రోజు, అధికంగా తొమ్మిదో రోజు నీటి గుంటల్లో నిమజ్జనం చేశారు. తిరుపతిలో చుట్టుపక్కల ఐదారు చెరువులు ఉండాయి. ప్రధానంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికనే వినాయక సాగర్ను సిద్ధం చేశారు. ఇందులోనే 90శాతంగా పైగా విగ్రహాలు నిమజ్జనం జరిగింది. అందులో 95 శాతం వరకు పిఓపి విగ్రహాలే (రసాయనాలతో కూడిన, కార్బన్ తో తయారు చేసినవి). 5 శాతం మాత్రమే మట్టివిగ్రహాలు, అందులో కూడా 2, 3 శాతం మేరకు ఇళ్లల్లో ఏర్పాటు చేసినవి, ఒకటి, రెండు శాతం మాత్రమే పెద్ద వాటిల్లో మట్టివిగ్రహాలు ఉండడం గమనార్హం. వీటిని నిమజ్జనం చేసిన వినాయకసాగర్లో 15 రోజులు దాటిన తరువాత కూడా విగ్రహాలు నీటిలో కరగడం దేవుడెరుగు, కనీసం మునిగిన పాపాన పోలేదు. అంటే రసాయనాలు ఎంత పెద్ద మొత్తంలో వాడుతున్నారో ఇదొక్క ఉదాహరణ మాత్రమే.

వాస్తవానికి తిరుపతికి సమీపంలోని కరకంబాడీ రోడ్డులో బొమ్మల క్వార్టర్స్ అందరికి సుపరిచితమే. ఇక్కడ 40 సంవత్సరాలుగా 100 కుటుంబాలు బొమ్మలు తరూరు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. వినాయక విగ్రహాల తయారే వీరికి ప్రాధాన వ్యాపారం. ఇందులో ఒకటి, అరా తప్పా అది కూడా వినియోగదారుల కోరికతో మిగితావన్ని మట్టి విగ్రహాలే తయారు చేస్తారు. ప్రతి ఏడాది ఇక్కడ నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు విగ్రహాలను ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ తయారు చేసే వాటిలో కనీసం 5 శాతం విగ్రహాలు కూడా తిరుపతి నగరంలో వినియోగించకపోవడం గమనార్హం. శిల్పారామం, కొర్లగుంట సర్కిల్, ఉల్లిపట్టెడ, తదితర ప్రాంతాల్లో విరివిగా పిఓపి విగ్రహాలు లభ్యమవుతుండడంతో వాటినే వినియోగిస్తున్నారు. పైగా అవి ధర కూడా కాస్త తక్కువే. అందుకే బొమ్మలక్వార్టర్స్ వద్ద దొరికే మట్టివిగ్రహాలపై మక్కువ చూపరు. అదే తమిళనాడు, కర్ణాటకలో అక్కడ ప్రభుత్వాలు మట్టి వినాయకులు మాత్రమే ఏర్పాటు చేయాలని అదేశాలు ఇచ్చాయి. దాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటుండడంతో ప్రజలు తప్పని సరి పరిస్థితుల్లో మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి బొమ్మల క్వార్టర్స్‌కు పరుగులు తీసున్నారు. ఇక్కడ ప్రభుత్వాలు అలాంటి చొరవ చూపకపోవడంతో, ప్రజలు మట్టి విగ్రహాలపై ఆశక్తి చూపడం లేదు. పర్యావరణాన్ని కాపాడాలని పరిశోధకులు, శాస్త్రవేత్తలు, మేధావులు అనేక మంది పిలుపునిస్తున్న ఆంధ్రా పాలకులకు తేలుకుట్టినట్లు కూడా లేకపోవడం బాదాకరం. ఉల్లాసవంతంగా, ఉత్సాహభరతంగా సాగే ఉత్సవాలకు ఎవ్వరూ అడ్డుకాదు. పర్యావరణాన్ని పాడు చేసే వాటి వినియోగాన్ని నివారించాలన్నదే ప్రతి ఒక్కరి తపన. ఆ దిశగా ఇకనైనా ప్రభుత్వాలు, అధికారులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..

వినాయకసాగర్‌లో ఇప్పటికీ కరగని వినాయక విగ్రహాలు

గ్రీవెన్స్‌కు 7 అర్జీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేకు 7 అర్జీలు వచ్చినట్లు, తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. పాసుబుక్ కోసం 3, వాల్ట్ సర్టిఫికెట్ కోసం 1, నివేశ స్థలంకోసం1, భూసర్వే కోసం 2 అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు.

జీఎస్టీపై సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వస్తువులు, సేవల పన్ను(జీఎస్టీ) చట్టాలపై, నియమ నిబంధనలపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించింది. ఈ 40 రోజుల కోర్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి ప్రారంభిస్తూ జీఎస్టీ చట్టాలు, నిబంధనల సంక్లిష్టతలను అర్థం చేసుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కామర్స్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలయ్య, కామర్స్ విభాగ అధ్యక్షులు డాక్టర్ వాసవి, డాక్టర్ గంగయ్య, డాక్టర్ శ్రీనివాసులు తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలం ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బి ఎన్ కండ్రిగ మండలం, కనమనంబేడు గ్రామ సర్వేనెంబర్ 259/1లో రెండు ఎకరాల భూమి యానాది మహిళ అయినా తుపాకుల మంగమ్మకు చెందినది. కానీ సదరు భూమిని ఆక్రమించుకుని జలగం సంధ్యారాణి నాయుడు, సముద్రాల రవి నాయుడు ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారు. ఈ విషయంపై తుపాకుల మంగమ్మ బుచ్చినాయుడు కండ్రిగ, తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం డిప్యూటీ తహశీల్దారు నాగరాజుని కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈసందర్భంగా యానాదుల సంక్షేమ సంఘం, తిరుపతి జిల్లా అధ్యక్షులు, తలపల చెంచు మల్లికార్జునరావు మాట్లాడుతూ యానాదుల పొలాన్ని ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, పొలాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ విచారించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా చైర్పర్, అత్తూరు చెంగల్రాయలు, జిల్లా అధ్యక్షురాలు, ఎలుగోటి రేవతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి రాములమ్మ, ఉపాధ్యక్షురాలు పసలపాకుల కల్పన, రమేష్, ఇతర గిరిజనులు పాల్గొన్నారు.

సరస్వతి బాయికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని సరస్వతి బాయి కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.అనూరాధ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి.సుధా మార్గదర్శకత్వంలో "ఎఐ-ఆధారిత క్లౌడ్ ఫోరెన్సిక్స్ సెక్యూరిటీ మోడల్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ఫర్ ఇంట్రూషన్ ఐడెంటిఫికేషన్ అండ్ ఎవిడెన్షియల్ ప్రిజర్వేషన్" అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా పొందారు. ప్రస్తుతం సరస్వతి బాయి అదే విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఘనంగా యుఎస్ఓ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్ : యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "యుఎస్ఓ వివిక్ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్ - 2025" ను సోమవారం తిరుపతి విశ్వం ప్రై స్కూల్, విశ్వం నగర్, జీవకోన వేదికగా విజయవంతంగా నిర్వహించారు. తిరుపతిలో తొలిసారిగా నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు స్పాట్ పెయింటింగ్, ప్రసంగం, గ్రూప్ డాన్స్, వన్-యాక్ట్ ప్లే, సైన్స్ ఫెయిర్ వంటి విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యా శాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. విశ్వం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డా.ఎన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ గుణాలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఓ సెక్రటరీ జనరల్ నైనా జైన్, వైస్ ప్రెసిడెంట్ కె.వి. త్యాగరాజన్, విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, బ్రిగేడియర్ విజయ్ కుమార్ మెహ్రా, తిరుపతి జిల్లా ప్రైవేట్ పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ ఏ.చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి -ఏర్పేడు : ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశాలతో సోమవారం ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆధార్ క్యాంపును ప్రారంభించారు. ఈ ఆధార్ క్యాంపు ఆరు రోజులపాటు నిర్వహిస్తారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు కేవీ రమణ ఆధ్వర్యంలో మేరకు ఈ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్ లేని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని పొయ్య పంచాయతీ, గిరిజన కాలనీ వాసులు ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సోమవారం గిరిజనులకు 3 ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో దినేష్, ప్రదీప్ కుమార్, శ్రీను, సురేష్ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్లలో జనసేన నాయకులు

స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రంగంపేటలో సోమవారం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ (మహిళా ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ వేణు గోపాల్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిరెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షులు బెల్లంకొండ రమేష్ హాజరయ్యారు. డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అక్రమ బదిలీలు ఆపాలి

- డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ఆందోళన
- కొనసాగుతున్న మహిళల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లో కొందరిని నారావారిపల్లె, కుప్పం డిఎస్సీ సెంటర్కు 2 వారాల శిక్షణ నిమిత్తం పంపించారు. అయితే ముగ్గురు సిహెచ్ఓలను చిత్తూరు జిల్లా కుప్పంలో మాత్రమే పని చేయాలని తెలిపారు. దీంతో సిహెచ్ఓలను చిత్తూరు జిల్లా పరిధిలో 60 నుండి 70 మంది డిజిటల్ నర్స్ సెంటర్ కోసం ఉన్నారని, మేము తిరుపతి పరిధిలో డిజిటల్ నర్స్ సెంటర్‌లో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కానీ వారి సమస్యలను వినకుండా కలెక్టర్, డిఎం హెచ్ ఓలు సరెండర్ ఆదేశాలు ఇవ్వడాని ఆవేదన వ్యక్తం చేశారు. తాము స్వయంగా వెళ్లి మాట్లాడిన, డీఎంహెచ్ఓ న్యాయం చేయకపోగా ఆ పని నుండి తీసివేస్తామని బెదిరించారన్నారు. బదిలీలు చేసిన వారందరికీ చిన్న పిల్లలు ఉన్నారని, అక్రమ బదిలీలపై ఎపిఐ వరకు పోరాటం చేస్తామని ఏపిఎంపిఎ స్టేట్ సెక్రటరీ, సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర, జేపీఎస్ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్లు తెలిపారు.

పూడి రహదారి.. ప్రమాదకరంగా మారి..!

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) :
పల్లెటూళ్లే దేశానికి పట్టుకొమ్మలంటుంటారు. రహదారులు సక్రమంగా ఉంటేనే ఆ చుట్టుపక్కల గ్రామాలు తొందరగా అభివృద్ధి చెందుతాయి. అటువంటిది ఆదిలోనే హంసపాదం అన్నట్టు రహదారుల సక్రమంగా లేకపోతే తమ గ్రామాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ నాయకులైన మొదటగా చెప్పే మాట మీ గ్రామాలకు బంగారం లాంటి రహదారులు నిర్మిస్తాం. మీ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తాం. కానీ నాయకులు చెప్పిన మాటలకు ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఉన్న రహదారులకు పొంతన లేదు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే నాయకులు చెప్పిన మాటలు ఒట్టి నీటి మూటలుగా కనిపిస్తున్నాయనే మాటలు గ్రామాల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో తొట్టంబేడు మండలం పూడి పంచాయితీ ఉంది. ఈ గ్రామానికి పక్కనే పేన్నలపాడు గ్రామం ఉంది. పూడి గ్రామంలో 430 కుటుంబాలు, పెన్నలపాడులో 130 కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే రెండు ప్రక్కల నుంచి రహదారి ఉంది. ఒకటి కనుపర్తి నుంచి పూడి గ్రామానికి వెళ్ళవచ్చు. మరొకటి ఆరు లైన్ల జాతీయ రహదారి నుంచి గిరిజన కాలనీ మీదుగా పూడి గ్రామానికి వెళ్ళవచ్చు. గిరిజన కాలనీ మీదుగా వెళితే ప్రయాణికులకు ఒక కిలోమీటర్ దూరం తగ్గుతుందన్న కారణంగా ఎక్కువ మంది ఈ రహదారిలోనే ప్రయాణిస్తుంటారు. ఈ రహదారిలో పూడి, పేన్నలపాడు గ్రామాలకు చెందిన వారు రోజువారి పని మీద శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చి వెళుతుంటారు. ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు ప్రతినిత్యం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చి కూలి పని చేసుకుని ఇదే రహదారిలోనే తమ గ్రామాలకు వెళుతుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ రహదారి పరిస్థితి చూస్తే మాత్రం ఎవరైనా ముక్కు మీద వేలు వేసుకోవాల్సిందే. ఆరు లైన్ల జాతీయ రహదారి నుండి పూడి గిరిజన కాలనీ వరకు రహదారి మొత్తం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉన్నాయి. అలాగే ఈ మధ్యకాలంలో వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ గుంతల నిండా వర్షపు నీరు చేరి ఎక్కడ ఎంత పెద్ద గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఈ రహదారి గుండా ఆటో డ్రైవర్లు ఈ గ్రామాల నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని సవారీలకు వెళ్తుంటారు. ఈ గుంతల రోడ్ల వల్ల ఆటోలో ప్రయాణించే వారికి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అలాగే ఆటోనే బ్రతుకుతెరువుగా ఎంచుకొని జీవిస్తున్న ఆటోవాలాలు ఈ గుంతల రహదారులలో ఆటోలు నడిపి రోజంతా కష్టపడితే వచ్చే ఆ నాలుగు రూపాయల డబ్బులతో ఆటోల మరమ్మత్తులకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇలాగైతే ఆటోల మీద తీసుకున్న అప్పులు ఎలా కట్టాలి, మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గిరిజన కాలనీ మీదుగా పూడి, పేన్నలపాడు గ్రామాలకు వెళ్లే రహదారిని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పై అధికారులకు నివేదిక పంపాం..

గిరిజన కాలనీ మీదుగా పూడి గ్రామానికి వెళ్లే రహదారి గుంతల మయంగా ఉన్న మాట వాస్తవమే. రోడ్డు మరమ్మత్తులు నిర్వహించడానికి పై అధికారులకు నివేదిక పంపి ఉన్నాం, తొందరలోనే గుంతలు లేకుండా రహదారిని ఏర్పాటు చేస్తాం. **- దుర్గేష్, ఆర్.అండ్.బి, ఏ.ఈ**

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అక్టోబర్ 13,14 తేదీల్లో, పుత్తూరులో జరిగే సిఐటియు తిరుపతి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, జిల్లా సహ కార కార్యదర్శి వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పుత్తూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎ.విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మహాసభలు పుత్తూరు, వివిఎస్ఎన్ కళ్యాణ మండపంలో జరుగుతాయని,కార్మిక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం పిళ్లయ్, నరసింహులు, కృష్ణయ్య, విజయ్ కుమారి, ముని కుమారి, రాధా, పద్మజ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వడమాలపేట మండల తహశీల్దార్‌కు ఏఐటియుసి నాయకత్వంలో ఆశా వర్కర్స్ వినతి పత్రాలు సమర్పించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమావతి, పుత్తూరు డివిజన్ కార్యదర్శి చంద్రబాబులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఐక్యంగా పోరాడి రూ. 1,50,000 గ్రాట్యుటీ, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ చేయడం పట్ల ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఇంకా ఆశా వర్కర్ల పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో వాటిని చర్చించి పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహశీల్దారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

మహీంద్ర యువో టెకం 475డిఐ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నంబర్ వన్ ట్రాక్టర్ బ్రాండ్ అయిన మహీంద్రా ట్రాక్టర్స్ సరికొత్తగా మహీంద్రా యువో టెకం 475 డిఐ పేరిట 42 హెచ్‌పీ ట్రాక్టరును ఆవిష్కరించింది. వ్యవసాయం, వ్యవసాయేతర పనులను సులభంగా చక్కబెట్టే విధంగా ఆధునిక సాంకేతికత, మరింత శక్తితో రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అత్యధిక ఉత్పాదకత, మరింతగా ఇంధనం ఆదా చేయగలిగే విధంగా, సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించిన మహీంద్రా యువో టెకం 475 డిఐ, దేశవ్యాప్తంగా రైతులకు విశ్వసనీయమైన భాగస్వామిగా నిలుస్తుందని ఆ సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల వ్యాప్తంగా మహీంద్రా ట్రాక్టర్ డీలర్‌షిప్‌లలో ఈ ట్రాక్టరు అందుబాటులో ఉందని, వినియోగదారుల అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్వీయుకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత ప్రభుత్వం పక్షాన ఏర్పాటైన "అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ కార్యక్రమం కింద సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నుండి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ప్రాజెక్ట్ యస్వీయు మంజూరు కావడం పట్ల ఎస్వీయూ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు హర్షం వ్యక్తంచేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పెయిర్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ ద్వారా "ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ అండ్ మెడికల్ టెక్నాలజీస్: సస్టైనబుల్ హెల్త్ ఫర్ రెసిలెంట్ ఫ్యూచర్", హైదరాబాద్ విశ్వవిద్యాలయం హబ్‌గా, యస్వీయు స్పోక్ సంస్థలలో ఒకటిగా పరిశోధనలు చేస్తుందని, ఈ ప్రాజెక్ట్ కేటగిరీ 'ఎ' కిందకు వస్తుందని, 5 సంవత్సరాలు ఆర్థిక మద్దతు ఉంటుందన్నారు.

స్విమ్స్‌లో ఎంబిబిఎస్ విద్యార్థులకు అవగాహన

తిరుపతి సిటీ : స్విమ్స్‌కు అనుబంధంగా వున్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో యంబిబిఎస్ 2025-26 విద్యా సంవత్సరానికిఅడ్మిషన్ పొందిన విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాలలో బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో వైద్య సీటు రావటం దైవ సంకల్పమని, వైద్య వత్తిలోకి ప్రవేశించిన తరువాత సేవభావంతో వైద్య సేవలు అందించాలని కోరారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్ మాట్లాడుతూ స్విమ్స్‌ను ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఉషాకళావత్ మాట్లాడుతూ శ్రీ పద్మావతి విద్యార్థినీలు మంచి నడవడికతో విద్యనభ్యసించి ఉన్నత డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

రేణిగుంటలో కుక్కల బీభత్సం

ఒకేరోజు ఆరుగురు చిన్నారులపై ఎటాక్.. కుక్కల బెడద తప్పించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట పంచాయతీ పాంచాలినగర్ వీధుల్లో కుక్కలు వీర విహారం బీబత్సం చేస్తూ పాఠశాలలో చదువుతున్న చిన్న పిల్లలను ఒక్క రోజులోనే ఆరుగురిని కరిచి గాయపరిచాయని సిపిఎం ఎంపిటిసి ఎన్.రాజేశ్వరి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, జెవివి నాయకులు కుప్పస్వామి, ఐద్వా నాయకురాలు భారతి, కార్యదర్శి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ ఈవోకు వినతిపత్రం ఇచ్చారు. మోహిత్ (9), దిలీప్ (3) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పిల్లలను, వృద్ధులను వెంటబడి మరి కుక్కలు కరచి బీభత్సం సృష్టిస్తున్నాయన్నారు. వీధికుక్కలను గుర్తించి అనిమల్ కేర్ ద్వారా రేణిగుంట నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

పరిశోధనలతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - క్యాంపస్ : నాణ్యతతో కూడుకున్న పరిశోధనలతోనే దేశం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఒడిశా, భువనేశ్వర్‌లోని భారత ప్రభుత్వ ఎన్ఆర్‌డిసి అవుట్ రీచ్ ఆఫీస్ హెడ్ డాక్టర్ బిజయకుమార్ సాహూ పేర్కొన్నారు. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఫర్ యూనివర్సిటీ ఎక్సలెన్స్ అండ్ సస్టైనబులిటీ అనే అంశంపై శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెనేట్ హాల్లో నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశోధనలు నూతన దృక్కోణాల్లో సాగాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య సి హెచ్ అప్పారావు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా పరిశోధనా రంగంలో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును యస్వీయూ సాధించిందని చెప్పారు. రీసెర్చ్ డీన్ ఆచార్య నరసింహ మాట్లాడుతూ పరిశోధన రంగంలో వస్తున్న మార్పు చేర్పులను ఎప్పటికప్పుడు పరిశోధకులు, శాస్త్రవేత్తలు అవగాహన చేసుకోవాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : గ్రామీణ మహిళ సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ పొంది వారి ప్రతిభను గ్రామీణ వనరులను, మానవ వనరులను ఉపయోగించుకుని బ్యాంకులు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు సహాయంతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డాక్టర్ ఎంఎస్ దత్తాత్రేయ రావు, ఆయుర్వే కాలేజీ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ పేర్కొన్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిరం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో గ్రామీణ మహిళలకు, యువతకు చిరుధాన్యాలు ఉత్పత్తి చేయు శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కామారెడ్డి హేమలత బయోఎంజైమ్ తయారు చేయడం గురించి వివరించారు. చిత్తూరు జిల్లా , ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు తోటలు పైరులు పెంపకంలో వచ్చే చీడపీడల నివారణలో తీసుకునే సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. మిల్లెట్ ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ ఎం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో బిస్కెట్స్, ఇతర ఉత్పత్తులను తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వండి

ప్రజాశక్తి - సత్యవేడు : డప్పు కళను ప్రభుత్వం గుర్తించి, కళాకారులకు గుర్తింపు కార్డులు అందించాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య, సత్యవేడు మండల డప్పు కళాకారుల ప్రథమ మహాసభలో డిమాండ్ చేశారు. సోమవారం బేరి శెట్టి కళ్యాణ మండపంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దేశాండి అరుణాచలం అధ్యక్షతన సత్యవేడు మండల డప్పు కళాకారుల సంఘం ప్రథమ మహా సభను నిర్వహించారు.సంఘ నాయకులు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ రీ-సర్వే పేరుతో డప్పు కళాకారుల పెన్షన్లను తొలగించే ప్రయత్నం చేయడం తగదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు ఇల్లు, రెండు ఎకరాల పొలం ఇవ్వాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దేశాండి అరుణాచలం మాట్లాడుతూ పెన్షన్లను 7వేలకు పెంచాలన్నారు. డ్రస్సులు, డప్పులు కొనడానికి నిధులు మంజూరు చేయాలని సత్యవేడు సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో త్రివిక్రమ్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్, కిష్టయ్య, మునుస్వామి, మురళి, విగ్నేష్, అనిల్, దినకరన్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలుఖ బిఎస్సి అగ్రి విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం పై వారం రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రెడ్డి శేఖర్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థి వ్యవహారాల ఇన్చార్జ్ డాక్టర్ హరిప్రసాద్, పాల్గొన్నారు.

డ్రాయింగ్, పెయింటిగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ రీజినల్ సెంటర్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహకారంతో, సోమవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో "విజన్ ఆఫ్ వికసిత్ భారత్ - సేవా పర్వ్ 2025" అనే అంశంపై ఆర్ట్ వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్.కృష్ణ మూర్తి, పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు యడ్లపల్లి, సామాజిక ప్రజాస్వామ్యవాది చంద్రగిరి పులివర్తి సుధారెడ్డి, నేషనల్ సంస్కృత విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణ రావు, తిరుపతి, ఐజిఎన్‌సిఎ, ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డా రాఘవన్ తదితరులు హాజరయ్యారు.

పరిహారం.. పరిహాసం..!

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పరిహారం కోసం బాధితులు 19 సంవత్సరాలుగా నిరీక్షిస్తున్నారు. అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. సంవత్సరాలు గడు స్తున్నాయి కానీ తమకు మాత్రం పరిహారం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. పుత్తూరు మున్సిపాలిటీ ఆవిర్భావం అనంతరం పట్టణంలో కార్వేటి నగరం రోడ్డు విస్తరణకు రూ.70లక్షలు మంజూరు చేశారు. దీంతో రోడ్డు విస్తరణ కోసం 60 అడుగుల మేర స్వచ్ఛందంగా ఇరువైపులా స్థలాలు ఇవ్వాలని స్థానిక మార్కెట్ యార్డులో బాధితులు, అధికారులతో కలిసి అప్పటి ఎమ్మెల్యే దివంగత నేత గాలిముద్దుకృష్ణమనాయుడు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సమావేశంలో బాధితులు స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారు. 52 మందికి పరిహారం చెల్లించేందుకు అధికారులు అంగీకరించారు. 2006లో పనులు ప్రారంభించారు. కానీ 16 మంది కోర్టును ఆశ్రయించారు. దీంతో పరి హారం చెల్లించాకే పనులు చేయాలని కోర్టు స్టే ఇచ్చింది. దీంతో పనులు నిలిచిపోయాయి.

→ రీ-టెండర్లు పిలిచి.. ←

కార్వేటినగరం రోడ్డు బాధితులకు పరిహారం చెల్లించేందుకు ఆర్ అండ్ బి శాఖ ప్రభుత్వం ద్వారా చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఖాతాకు రూ.50 లక్షలు జమ చేశారు. పరిహారం చెల్లించి పనులు చేయాలని ఆదేశాలిచ్చారు. కోర్టులో కేసు నడుస్తున్న తరుణంలో పరిహారం ఇవ్వడం కుదరదని అప్పట్లో చిత్తూరు ఆర్డీవో తేల్చి చెప్పారు. 2012లో తిరిగి రీ టెండర్లు పిలిచి కార్వేటినగరం రోడ్డు కూడలి నుంచి ఆరేటమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు వేశారు. కానీ బాధితులకు ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదు. 52 మంది బాధితుల్లో 16 మంది కోర్టుకు వెళ్లారు. మిగిలిన వారికి పరిహారం చెల్లించాలని పలు మార్లు అప్పట్లో దివంగత గాలి ముద్దుకృష్ణమ నాయుడు అధికారులను కోరారు. బాధితులు పలు మార్లు రెవెన్యూ అధికారులను కలిసి వినతులు అందజేసినా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

భవన యజమానులకు పరిహారం చెల్లించకుండా విస్తరణ పనులు జరిగిన రహదారి ఇదే..

క్రైం న్యూస్

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

ప్రజాశక్తి - యర్రావారి పాలెం: బాకరాపేట అటవీ క్షేత్ర అధికారి వెంకటరమణకు అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా తలకోన నార్త్ బీట్, ఉస్తికాయలపెంట అటవీ సమీపంలో మర్రిమాకులపల్లి దగ్గర నిఘా పెట్టామన్నారు. ఎల్లమంద భాకరాపేట రోడ్డు మార్గంలో వస్తున్న కారు, తమను చూసి వాహనాన్ని వదిలేసి పారిపోతుండగా చుట్టుముట్టి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. స్మగ్లర్ చిత్తూరుకు చెందిన మునిస్వామి సతీష్‌గా గుర్తించారు. కారులో ఉన్న పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ 14 లక్షల, 45 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ మునుస్వామి నాయక్ ఎఫ్‌బిఓలు, రాజేష్ కుమార్, ప్రదీప్ చాంద్, లక్ష్మీ ప్రసాద్, డ్రైవర్ శంకర్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

తరగతి గదిలోకి పాము

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని పెద్ద కన్నలి ప్రాథమిక పాఠశాల గదిలోకి సోమవారం నాగుపాము ప్రవేశించి హడలెత్తించింది. గమనించిన స్థానికులు చుట్టుపక్కల ఉన్న వారి సహాయంతో పామును కొట్టి చంపారు. సోమవారం నుంచి పాఠశాలకు దసరా సెలవులు కావడంతో విద్యార్థులు ఎవరు లేరని, పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. మున్సిపాలిటీ 1సెక్టార్, బలిజ స్ట్రీట్, అంగన్వాడీ కేంద్రంలో స్వస్థ నారి పరివార్ కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈశ్వరి, అంబికా, సుగుణ, కవితలు పాల్గొన్నారు.

తనది కాని బండికి చాలానా?

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక జంగావాండ్లపల్లె పంచాయతీ, కురవపల్లెకు చెందిన సింహాల మోహన (చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు) తనది కాని బండికి చలానా కట్టాలంటూ పదేపదే ఫోన్ చేస్తున్నారని తనది కానీ బండికి చలానా ఏమిటో అర్థం కాలేదని వాపోతున్నారు. ఆయనకు ఎపీ 03 బియు 0430 డిస్కవరీ ద్విచక్ర వాహనం ఉంది. అయితే 24-07-2025, ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా చిత్తూరులో వెళుతుండగా చలానా వేసినట్లు మెసేజ్ వచ్చిందన్నారు. ఈ విషయమై చిత్తూరు ఎస్పీ కార్యాలయం నుంచి ఫోన్లు వస్తున్నాయన్నారు. ఆ చలానా సంబంధిత వాహనం తనది కాదని వారికి తెలిపానన్నారు. కానీ ఫైన్ చెల్లించాల్సిందేనని మెసేజ్ పంపారన్నారు.ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నానన్నారు.

టీబీ పై ఆందోళన వద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టీబి వ్యాధిపై ఆందోళన చెందాల్సిన పని లేదని, తిరుపతి జిల్లా గూడూరు వైద్య విధాన పరిషత్ సూపరెడ్డెంట్ డాక్టర్ షరీనా పేర్కొన్నారు. సోమవారం ఆ బైండింగ్ హోప్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ గత ఐదు సంవత్సరాల నుంచి 500 మందికి ప్రతినెల ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువైన న్యూట్రిషన్ ఫుడ్ పాకెట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ న్యూట్రిషన్ ఫుడ్‌తో పాటు స్వయం ఉపాధి పథకాలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేష్మ. ఏవో కమల్ కిరణ్, జయ ప్రకాష్, సురేందర్ రెడ్డి ప్రియాంక, క్రాంతి కుమార్, శకుంతల. ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతంగా చేయాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో చేపట్టిన భూ రీ సర్వే వేగవంతం చేయాలని తహసిల్దార్ శ్రీదేవి రెవిన్యూ సిబ్బందిని కోరారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూముల పూర్తి సమాచారాన్ని ఆన్లైన్‌లో నమోదుచేయాలన్నారు. భూ వివాదాలను, వారసత్వ హక్కులను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచయతీ వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ చేయించండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమల పరకామణి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలతో ప్రపంచవ్యాప్తంగా భక్తుల విశ్వాసం దెబ్బ తింటోందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సిబిఐ విచారణ కోరుతూ కేంద్ర హో మంత్రి అమిత్ షాకి, భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండా పరకామణిలో దొంగతనం, దుర్వినియోగం జరిగిందని రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తోందని తన లేఖలో పేర్కొన్నారు. సీబీఐ దర్యాప్తు చేపడితే తప్పుడు ఆరోపణలకు తెరపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వర్షాకాలాన్ని తట్టుకుని సమర్థవంతంగా ట్రాఫిక్ విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సామగ్రిని ఎస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వన్ టౌన్ పోలీసులకు అందజేశారు. రైన్ కోట్స్(జర్కినీలు), 30 లాఠీలను వితరణ చేయడం జరిగినది. గతంలో కూడా ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్స్, లైటింగ్ బాటెన్లు కూడా ఇచ్చినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. వన్ టౌన్ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలో నగర్ సెక్షన్, మంగళం రూరల్స్ సెక్షన్ 33/11 కె.వి. టి ఎన్ పాలెం ఫీడర్ మునిసిపాలిటి లైన్లు షిఫ్టింగ్ వర్క్స్, మరమ్మత్తులు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తిరుపతి ఆపరేషన్ ఈఈ గంగాధర్ రెడ్డి ప్రకటన తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కుర్రపటి రామచంద్ర నగర్, టిఎన్ పాలెం తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P. No: 189 / 2025

1. Shaik Shaliha
2. Shaik Farhan Ahned
3. Shaik Aamira Faziya ...పిటిషనర్లు

Vs.

Nil ....రెస్పాండెంట్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబర్ కేసులో పిటిషనర్లు సూళ్ళూరుపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో వున్న Shaik Muntaz begam గారి bank safe Locker deposit మొత్తమును మాకు రావలసినదిగా కోరుచూ పై కోర్టులో Succession Certificate కొరకు పిటిషను పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 6-10-2025 పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

ఇట్లు
ఎస్. చంద్రమోహన్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, గూడూరు.